
సాక్షి ప్రకాశం

గురువారం । 15 । మే । 2025



'ఘనుల' చెరలో వందల ఎకరాలు

చీమకుర్తిలోని గ్రానైట్ క్వారీల పరిసరాల్లో 1500 ఎకరాల భూములను ఆక్రమించారు.

- 8లో..



వైఎస్సార్ సీపీ జెండా తొలగింపు.. అదే బరితెగింపు..

వైఎస్సార్ సీపీ జెండా తమ ముందు రెపరెపలాడటాన్ని జీర్ణించుకోలేక అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టి మరోసారి జెండాను తొలగించారు.- 8లో..

గరిష్టం/కనిష్టం
39 /29

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



మౌళిమనోహర్ భౌతికకాయం

రాచర్ల: రాచర్లకు చెందిన ఆర్మీ జవాన్ గంజికుంట్ల మౌళిమనోహర్ (40) ముంబయిలోని ఏఎంసీ సెంటర్‌లో విధులు నిర్వహిస్తూ మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. మౌళిమనోహర్ భౌతికకాయాన్ని ఆర్మీ అధికారులైన సుబేదార్ బీఎస్‌టీ, హవల్దారులు రాధాకృష్ణనాయర్, నాగ సాయిబాబు బుధవారం రాత్రి 7:30 గంటలకు రాచర్లలోని నివాసానికి తీసుకువచ్చారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక



గోల్డ్ మెడల్ అందుకుంటున్న బసవేశ్వరరావు

మార్కాపురం: కర్నూల్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగిన జాతీయస్థాయి ఉషూ పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన పొట్లేళ్ల బసవేశ్వరరావు గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ జూన్‌లో భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు. బసవేశ్వరరావును పలువురు అభినందించారు. రాష్ట్ర వుష్ అసోసియేషన్ కార్యదర్శి నరసింహారావు, జిల్లా సెక్రటరీ నేషనల్ కోచ్ చంద్రశేఖర్ అభినందించారు.

పాలీసెట్‌లో జిల్లా విద్యార్థుల సత్తా



120/120 మార్కులు సాధించిన ర్యాంక్ కార్డు



చలువాది ఖదిరీష్

ఒంగోలు సిటీ/ చీమకుర్తి: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 30న నిర్వహించిన పాలీసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పరీక్షకు మొత్తం 3,950 మంది విద్యార్థులు హాజరు కాగా 3804 మంది అర్హత సాధించారు. చీమకుర్తికి చెందిన ఖదిరీష్ 120/120 మార్కులు సాధించి జిల్లా ప్రథమస్థానం, రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంక్ సాధించినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 120/120 మార్కులను పలువురు సాధించడంతో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంక్ సాధించాడు. ఖదిరీష్‌ను శ్రీసూర్య పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రుషి, తల్లిదండ్రులు, బంధువులు, కాలేజీ అధ్యాపకులు అభినందించారు. అలాగే బెల్లంకొండ వెంకట్ జిల్లాస్థాయిలో రెండోర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 42వ ర్యాంకు సాధించాడు. పి.లారారోజ్ జిల్లాస్థాయి మూడవ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 196వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 11 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. ఒంగోలులో ఏడు, మార్కాపురంలో నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.

'మీకు ఇష్టమొచ్చినట్లు చేయలేను'

కొత్తపట్నం: 'మీకు ఇష్టమొచ్చినట్లు చేయాలంటే కుదరదు. రికార్డులన్నీ సక్రమంగా ఉంటేనే చేస్తామ'ని కొత్తపట్నం తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు స్పష్టం చేశారు. స్థానిక నల్లూరి గార్డెన్స్‌లో బుధవారం అధికారులతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకుడు చంపాని రామచంద్రయ్య తహసీల్దార్‌పై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశాడు. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సంబంధించిన రికార్డులన్నీ సక్రమంగా ఉండాలని, మీకు ఇష్టమొచ్చినట్లు చేయాలంటే కుదరదని చెప్పారు. అర్జీ పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ చేయాల్సిన మాపై ఉందని సమాధానం ఇచ్చారు.

ఆధిపత్య పోరే కడతేర్చింది..!



వీరయ్య చౌదరి మృతదేహం (ఫైల్)

నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన పాత్రధారులందరూ తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులే అని మొదట్నుంచి సాక్షి చెప్పింది. అదే నేడు వాస్తవమైంది. వీరయ్య చౌదరి హత్యకు పథక రచన చేసిన ప్రధాన సూత్రధారులందరూ అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులేనని తేలడంతో అధికార పార్టీ నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. గ్రామంలో జరిగిన ఆధిపత్య పోరులో భాగంగానే ఈ హత్య జరిగిందని ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రకటించడంతో 23 రోజులుగా జరుగుతున్న ప్రచారం నిజమని తేలింది.

- టీడీపీ చుట్టే వీరయ్య చౌదరి హత్యకేసు
- నిందితులంతా అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ నాయకులే
- పాత్రధారులంతా నెల్లూరుకు చెందిన కిరాయి హంతకులు
- పరారీలో టీడీపీ నాయకుడు ముప్పా సురేష్
- కేసులు లేకుండా చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పాత్రధారులకు హామీ ఇచ్చిన సూత్రధారులు
- మంత్రి లోకేష్ పర్యటనకు ముందు హడావుడిగా ప్రకటన
- టీడీపీ నాయకులు కావడంతోనే విచారణ ఆలస్యమైందన్న ప్రచారం



నిందితులు ఉపయోగించిన ఆయుధాలు, ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్



నిందితుడు సాంబయ్యను తీసుకువస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గత నెల 22వ తేదీ రాత్రి 7.30 నిమిషాలకు హత్య జరింగింది. అదే రోజు రాత్రి హోం మంత్రి వంగలపూడి అనిత హుటాహుటిన ఒంగోలుకు చేరుకున్నారు. మరుసటి రోజు జరిగిన అంత్యక్రియలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. దీంతో ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం ఎంత సీరియస్‌గా తీసుకుందో అందరికీ అర్థమైపోయింది. హత్యకు గురైన వీరయ్య చౌదరి, హత్యకు పథక రచన చేసిన ప్రధాన సూత్రధారులంతా తెలుగుదేశం పార్టీ నాయకులే కావడంతో కేసులో మొదట కనిపించిన సీరియస్ తరువాత కనిపించలేదని, అందుకే కేసు విచారణ ఆలస్యమైందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అసలు హత్యను ఎక్కడ నీరుగారుస్తారోనన్న సందేహాలు సైతం వ్యక్తమయ్యాయి.

వీరయ్యకు పదవి వస్తుందన్న సమాచారంతో..

వీరయ్య చౌదరి గతంలో నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేశారు. ప్రస్తుతం మద్యం వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. అదే సమయంలో స్వగ్రామమైన అమ్మనబ్రోలు టీడీపీలో నాయకుడిగా గ్రామ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనకు సన్నిహితులైన ముప్పా సురేష్, అతడి మామ, సిద్దాంతి ఆళ్ల సాంబయ్య, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి తదితరులతో ఆయనకు విభేదాలు ఏర్పడ్డాయి. గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికలలో వీరయ్య చౌదరి మద్దతు ఇచ్చిన అభ్యర్థికి పోటీగా ముప్పా వర్గం మరో అభ్యర్థిని పోటీకి దింపి విజయం సాధించింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య పోరు తీవ్రమైంది. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో వీరయ్య చౌదరి ఆధిపత్యం పెరిగింది. యువగళంలో నారాలోకేష్‌తో తిరిగిన సాన్నిహిత్యంతో పార్టీలో పట్టుసాధించాడు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా వీరయ్య చౌదరి పేరును లోకేష్ ఖరారు చేసినట్లు ప్రచారం జరిగింది. దాంతో ప్రత్యర్థి వర్గం అప్రమత్తమైంది. వీరయ్యకు కనుక పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి దక్కితే అతడిని ఎదుర్కోవడం కష్టమైపోతుందని భావించింది. అప్పటికే అతని కారణంగా వారు చాలా ఇబ్బందులు పడ్డారు. వీరయ్య బలపడితే తన మేనల్లుడు ముప్పా సురేష్‌కు రాజకీయ భవిష్యత్ ఉండదని ఆళ్ల సాంబయ్య భయపడ్డాడు. ఒంగోలు సమీపంలోని కొప్పోలుకు చెందిన వినోద్‌కు వీరయ్య చౌదరి అనుచరులకు మధ్య వివాదం ఉంది. ఇసుక వ్యాపారానికి సంబంధించి లారీని వారు పోలీసులకు పట్టించారు. దీనిని ఆసరాగా తీకుసుని వినోద్‌ను సంప్రదించాడు సాంబయ్య. నెల్లూరుకు చెందిన కిరాయి హంతకుల చేత వీరయ్యచౌదరిని అత్యంత క్రూరంగా హత్య చేయించాడు.

కేసుల్లేకుండా చేస్తామని నమ్మబలికి...

వీరయ్య చౌదరి హత్యలో ప్రధాన పాత్ర పోషించిన వినోద్‌కు ఎలాంటి కేసులు లేకుండా చేస్తానని, పోలీసులకు లొంగిపోయిన రెండో రోజే బయటకు తీసుకొస్తానని చెప్పి ఒప్పించినట్లు ఎస్పీ దామోదర్ విలేకరుల సమావేశంలో వెల్లడించడం గమనార్హం. అంతేకాకుండా నిందితులకు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని, జీవితంలో స్థిరపడవచ్చని నమ్మబలికినట్లు తెలిపారు. ప్రధాన పాత్రధారుడు ఆళ్ల సాంబయ్య, మరో నిందితుడైన అతడి మేనల్లుడు ముప్పా సురేష్‌లకు టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ అధిష్టానంతో సన్నిహిత పరిచయాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మనది కనుక ఏం చేసినా చెల్లుబాటు అవుతుందన్న ధీమాతోనే నిందితులకు అభయహస్తం ఇచ్చినట్లు భావిస్తున్నారు. సాంబయ్య ఇచ్చిన హామీతో వినోద్ నెల్లూరుకు చెందిన నిందితులకు చెప్పాడు. ఈ ఒక్క హత్యతో తమ కష్టాలు గట్టెక్కుతాయని నమ్మబలికాడు. దాంతో నిందితులు ఈ హత్యకు అంగీకరించారు. చివరికి నేరం చేసి జైలు పాలయ్యారు.

మూడు నెలల ముందు నుంచే ..

వీరయ్య చౌదరిని అంతమొందించేందుకు నిందితులు మూడు నెలల ముందునుంచే పలు మార్లు ప్రయత్నించారు. జనవరిలోనే వారు ఒంగోలుకు వచ్చారు. స్థానికంగా ఉంటూ హోటళ్లలో బసచేసి వీరయ్య కదలికలను తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని హత్యకు పథక రచన చేశారు. గత నెల 22వ తేదీ పక్కా స్కెచ్ వేశారు. ఎలాగైనా ఆరోజు అతనిని హత్య చేయాలని నిర్ణయానికి వచ్చారు. వీరయ్య చౌదరి తన కార్యాలయానికి చేరుకోగానే వారు కొద్ది సేపటికి రెండు వాహనాల్లో వచ్చారు. రెండో అంతస్తులో ఉన్న అతనిపై విచక్షణారహితంగా కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసి పరారయ్యారు.

కేసును మలుపు తిప్పిన స్కూటీ...

చీమకుర్తి సమీపంలో జాతీయ రహదారికి పక్కన ఉన్న ఒక డాబా వద్ద హంతకులు వినియోగించినట్లు చెబుతున్న స్కూటీని గత నెల 25వ తేదీన పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. దానిపై రక్తపు మరకలు ఉండంతో పక్కనే ఉన్న వారిని విచారించారు. అప్పటికే మూడు రోజులుగా ఆ స్కూటీ ఇక్కడ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో వెంటనే చీమకుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే రంగంలోకి దిగిన చీమకుర్తి పోలీసులు స్కూటీని స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. స్కూటీ మీద ఉన్న రక్తం మరకలను వైద్య పరీక్షలు చేయించగా వీరయ్య చౌదరి రక్తంతో సరిపోయాయి. దీంతో కేసు విచారణ వేగం అందుకుంది. మరో రోజు వ్యవధిలో మరో వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో కేసులో కీలక పురోగతి సాధించింది.

పరారీలోనే ముప్పా సురేష్...

వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుడిగా చెబుతున్న అమ్మనబ్రోలుకు చెందిన ముప్పా సురేష్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ ప్రకటించారు. అయితే వీరయ్య హత్య జరిగిన తరువాత సురేష్ ఒక టీవీ చానెల్‌కు ఆడియో పంపించాడు. మరుసటి రోజు ఆయన సతీమణిని కూడా అదే చానెల్ ఇంటర్వ్యూ చేసింది. పోలీసులు మాత్రం సురేష్ పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. ఒక టీవీ చానెల్ నిర్వాహకులకు అందుబాటులో వచ్చిన సురేష్ పోలీసులకు మాత్రం చిక్కకపోవడంపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ముప్పా సురేష్‌కు టీడీపీ అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు వున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అంతేకాకుండా గత టీడీపీ హయాంలో రాష్ట్రంలో కీలకమైన పదవిలో పనిచేసిన ఒక మాజీ ఐఏఎస్‌తోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీతో సన్నిహిత సంబంధాలు ఉన్న సదరు ఐఏఎస్ ఈ కేసులో చక్రం తిప్పినట్లు చెప్పుకుంటున్నారు. అధికార పార్టీ సహకారంతోనే ముప్పా సురేష్ దేశ సరిహద్దులు దాటినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

లోకేష్ పర్యటన నేపథ్యంలోనే హడావుడిగా..

వీరయ్య చౌదరి హత్య జరిగిన మరుసటి రోజు జరిగిన అంత్యక్రియలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మనబ్రోలుకు వచ్చారు. వీరయ్యను హత్య చేసిన హంతకులు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని, వారు ఈ నేల మీద ఉండేందుకు అర్హులు కాదని ప్రకటించారు. దీంతో నిందితులకు కఠిన శిక్షలు పడతాయని అంతా భావించారు. కానీ అంతా టీడీపీ వాళ్లే కావడంతో కేసు నత్తనడక నడిచిందన్న విమర్శలున్నాయి. వీరయ్య హత్య జరిగిన 24 రోజులకు ఆయన కుటుంబసభ్యులను పరామర్శించడానికి గురువారం మంత్రి నారా లోకేష్ అమ్మనబ్రోలుకు వస్తున్నారు. ఈ లోగా పోలీసులు హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి నిందితుల వివరాలను ప్రకటించారు. వీరయ్య చౌదరి హత్యకు పథక రచన చేసిన నిందితులంతా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులే కావడంతో ఇప్పుడు లోకేష్ ఏం చెప్తారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఎల్లో మీడియా గొంతులో పచ్చివెలక్కాయ...

వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా దేవేంద్ర చౌదరి పేరును ఎల్లో మీడియా ప్రచారం చేసింది. ఆ తరువాత కేసు విచారణ జరుగుతున్న క్రమంలో అంతా తెలుగుదేశం పార్టీ నాయకుల పేర్లే బయటకు రావడంతో ఆత్మరక్షణలో పడింది. ఎలాగైనా సరే కేసుకు రాజకీయ రంగు పులిమి ప్రత్యర్థి పార్టీలకు బురద పూయాలని చేయని ప్రయత్నం లేదు. దీనికి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. చివరి ప్రయత్నంగా ఎస్పీ ప్రెస్ మీట్‌లో సైతం వీరయ్య హత్య కేసులో రాజకీయాలను లాగేందుకు ఒక రాయి వేశారు. ఈ హత్యకు రాజకీయాలతో ఎలాంటి ప్రమేయం లేదని, కేవలం గ్రామ స్థాయిలో జరిగిన ఆధిపత్య పోరు వల్లే వీరయ్య హత్య జరిగిందని ఎస్పీ తేల్చి చెప్పడంతో వారి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది.



నిందితులను మీడియా ముందుకు తీసుకువస్తున్న పోలీసులు

ఉర్దూ విద్యకు ఉరి..?

- సర్‌ప్లస్ పేరుతో పోస్టుల తొలగింపు
- జిల్లాలో 42 ఉర్దూ టీచర్ పోస్టులకు మంగళం
- ఆందోళనలో ఉర్దూ విద్యార్థులు



మార్కాపురంలో ఉర్దూ పాఠశాల



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు

మార్కాపురం: కూటమి ప్రభుత్వం నిర్ణయం ముస్లిం విద్యార్థులను ఉర్దూ విద్యకు దూరం చేస్తోంది. పాఠశాల పునర్నిర్మాణ ప్రక్రియ పేరుతో ముస్లిం విద్యార్థులకు ప్రభుత్వం ఉర్దూ విద్యను దూరం చేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల పునప్రారంభం నాటికి జిల్లాలో ఉర్దూ టీచర్లు పలు చోట్ల కనుమరుగు కానున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీఓ నంబర్ 117ను రద్దుచేసి దాని స్థానంలో ఉన్నతమైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెబుతున్న కూటమి నాయకులు ఉర్దూను దూరం పెట్టడంపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మార్చి నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం పాఠశాలలకు పోస్టులను మంజూరు చేస్తోంది. దీనితో ఉర్దూ యూపీ పాఠశాలల సెక్షన్ స్కూళ్లకు అన్యాయం జరుగుతోంది. జిల్లాలో 49 ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్స్, 16 అప్పర్ ప్రైమరీ ఉర్దూ మీడియం స్కూల్స్, 2 ఉన్నత స్థాయి ఉర్దూ మీడియం హైస్కూల్స్ ఉన్నాయి. వీటిలో 57 ప్రైమరీ పాఠశాలల్లో ఉర్దూ సెక్షన్లు, 28 హైస్కూల్స్‌లో ఉర్దూ సెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 211 మంది ఉర్దూ టీచర్లు ఉన్నారు.

ఉర్దూ విద్య దూరం చేసేందుకే..

పాఠశాల వ్యవస్థ పునర్నిర్మాణంలో భాగంగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, ముస్లిం విద్యార్థులకు ఉర్దూ విద్యను దూరం చేస్తున్నాయి. యూపీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో 30కి పైగా విద్యార్థులు ఉండాలి. ఏ పాఠశాలల్లోనైనా ఇంతకంటే తక్కువ ఉంటే డి గ్రేడ్ చేస్తారు. దీంతో అనేక ఉర్దూ యూపీ పాఠశాలల్లో చదివే మైనార్టీ విద్యార్థులు ఉర్దూ చదువుకు దూరమవుతున్నారు. మార్కాపురం మండలంలో మార్కాపురం టౌన్, రాయవరం, బొడిచర్ల, తర్లుపాడు, తుమ్మలచెరువు, దేవరాజుగట్టు తదితర పాఠశాలల్లో ఉర్దూ చదివే విద్యార్థులు ఉన్నారు. వీరంతా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉర్దూ చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో మొత్తం 42 ఉర్దూ పోస్టులను సర్‌ప్లస్‌గా చూపారు. వీటి స్థానాల్లో వేరే టీచర్లను నియమించనున్నారు. దీంతో పలు స్కూళ్లలో ఉర్దూ పోస్టులు మాయమైపోతున్నాయి. గతంలో ఒక పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉంటే అందులో 15 మంది తెలుగు, 15 మంది ఉర్దూ చదివే విద్యార్థులు ఉంటే ఆయా సబ్జెక్టు టీచర్లను నియమించేవారు. నూతన నిబంధనల ప్రకారం ఉర్దూ టీచరు పోస్టును తొలగించనున్నారు. తర్లుపాడు మండలంలోని ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను తొలగించి తెలుగు ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. రాష్ట్రంలో ఉర్దూ రెండవ అధికార భాషగా ఉన్నా ప్రభుత్వ నిర్ణయంతో ఉర్దూకు దూరమవుతున్నారు.

ఉర్దూ టీచర్లను కొనసాగించాలి



జిల్లాలో సర్‌ప్లస్ పేరుతో 42 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను తొలగిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రేషనలైజేషన్ కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయులను ఏ విధంగా తొలగిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ విధానంపై మేం తీవ్ర ఆందోళన చెందుతున్నాం. 42 పోస్టులను కొనసాగిస్తూ ఉర్దూను బోధించకుంటే ఉద్యమం చేపడతాం. ఈ విషయమై మార్కాపురం సబ్‌కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందిచాం.

– పి.వహీద్‌ఖాన్, ఉర్దూ డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షుడు

ముస్లిం విద్యార్థులకు ఉర్దూ అవసరం లేదా ..?



రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పలు పాఠశాలల్లో ఉర్దూ యూపీ సెక్షన్ స్కూళ్లను తొలగిస్తున్నారు. దీని వల్ల ముస్లిం విద్యార్థులు ఉర్దూ విద్యకు దూరమవుతున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ప్రతి పాఠశాలలో కచ్చితంగా ఒక ఉర్దూ టీచర్‌ను నియమించాలి. లేకుంటే మేం పోరాటం చేస్తాం.

– మహ్మద్ రఫీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, మండల కోఆప్షన్ సభ్యుడు, మార్కాపురం

ఉదయ్‌కృష్ణారెడ్డి నేటి యువతకు స్ఫూర్తి

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్



ఉదయ్‌కృష్ణారెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: నేటి యువతకు ఉదయ్ కృష్ణారెడ్డి స్ఫూర్తి అని, కష్టపడితే లక్ష్యాన్ని ఏ విధంగా సులువుగా సాధించవచ్చో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి నిరూపించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. మండలంలో ఊళ్లపాలెం గ్రామానికి చెందిన సివిల్ ర్యాంకర్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం స్వయంగా కలుసుకున్నారు. సివిల్స్ సాధనలో ఉదయ్ కృష్ణారెడ్డి కృషిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ చిన్నతనంలో తల్లిని, యుక్తవయస్సులో తండ్రిని కోల్పోయినా నాయనమ్మ సంరక్షణలో ఈ ఘనత సాధించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేక మెమెంటో అందజేశారు. కృష్ణారెడ్డి నాయనమ్మ రమణమ్మకు ధన్యవాదములు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, కొండపి మండల అధ్యక్షుడు బచ్చల కోటేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధాకా పిచ్చిరెడ్డి, పాకనాటి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, షేక్ కరీం, పెరికాల సునీల్, పాలూరి శ్రీనివాసులరెడ్డి, చొప్పర శివ, సోమిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- బస్టాండ్లో తాగునీటి సౌకర్యం, శ్లాబుకు మరమ్మతులు
- ఆర్టీసీ డీఎం నరసింహులు

సాక్షి ఎఫెక్ట్..



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. గత నెల 27న సాక్షిలో 'ప్రయాణం.. చక్రబంధం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. బస్టాండ్లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందిని, శ్లాబ్ పెచ్చులూడి పోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని కథనంలో వివరించారు. దీనికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఆర్‌ఓ నీటి సౌకర్యం ఏర్పాటు చేశామని, పెచ్చులూడిన శ్లాబ్‌కు మరమ్మతులు చేయించామని, ప్రయాణికులు కూర్చునేందుకు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని డీఎం తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఆరుణాచలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని డీఎం కోరారు. ప్రతి పౌర్ణమి ముందురోజు బస్సు బయలుదేరుతుందని, రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో టిక్కెట్ రూ.2,500 ధరగా నిర్ణయించామన్నారు.

వృద్ధురాలి కళ్లలో కారంకొట్టి.. గొంతునొక్కి..

- 10 తులాల బంగారు ఆభరణాలు చోరీ
- మార్కాపురంలో దుండగుల దుశ్చర్య


వృద్ధురాలిని విచారిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం టౌన్: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలిపై ఇద్దరు దుండగులు దాడి చేసి బంగారం అపహరించారు. మార్కాపురం పట్టణంలో బుధవారం ఉదయం వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు బండి రమణమ్మపై మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఒక మహిళ, మరో పురుషుడు కలిసి దాడి చేశారు. వృద్ధురాలిని నిద్రలేపి కళ్లలో కారం చల్లి, గొంతు నొక్కడంతో ఆమె హతాశురాలైంది. దాడికి పాల్పడిన జంట వృద్ధురాలి చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు, మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. మొత్తం 10 తులాల బంగారు ఆభరణాలు దోపిడీ చేశారని బోరున విలపించింది. పట్టణ ఎస్సై సైదుబాబు వృద్ధురాలి నివాసానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన గంగరాజు

గిద్దలూరు రూరల్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకుంది. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని దంతెరపల్లె సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ జిల్లా కలశపాడు మండలం పుల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆర్.గంగరాజు(25) గిద్దలూరు మండలంలోని సంజీవరాయుడుపేటలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తన బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో దంతెరపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో గంగరాజు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గిద్దలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతి చెందిన యువకుడు గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వివాహం కాగా ఒక కుమారుడు ఉన్నాడని తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి


మృతి చెందిన వినయ్‌కుమార్

మద్దిపాడు: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్ మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి తరువాత మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా అల్లూరుకు చెందిన సూరి వినయ్‌కుమార్(43) లోడ్ లారీతో గుంటూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ దాటిన తరువాత ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టడంతో వినయ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో ఏడుగుండ్లపాడు సమీపంలో మృతి చెందాడు. మృతుని బంధువులకు సమాచారం అందించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని మద్దిపాడు ఎస్సై తెలిపారు.

ఘనుల చెరలో వందల ఎకరాలు
రెవెన్యూ నకరాలు!

- చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, బూదవాడలో 22ఏ జాబితాలో 2,947 ఎకరాల ప్రభుత్వ భూములు
- క్వారీల యజమానుల చేతిలో 1500 ఎకరాలకు పైగా భూములు
- లీజులు, ఎన్‌ఓసీల పేరుతో అధికారికంగా 1200 ఎకరాల్లో పాగా
- అనధికారికంగా మరో 300 ఎకరాలు అక్రమార్కుల చెప్పుచేతల్లో..
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారుల సర్వే
- అక్రమార్కుల భూకబ్జా భాగోతం బట్టబయలు
- చీమకుర్తిలో ఒకే కుటుంబం ఆధీనంలో 150 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి
- విలువైన భూములు అన్యాక్రాంతం వెనుక రెవెన్యూ, మైన్స్ అధికారుల హస్తం


గ్రానైట్ క్వారీల్లో ప్రభుత్వ భూములు ఎన్నెన్నో..

సాక్షి టాస్క్‌ఫోర్స్: పేదవాడు సాగు చేసుకుంటానంటే ఎకరం పొలం ఇవ్వరు. రోడ్డు పక్కన గుడిసె వేసుకుంటే తక్షణమే తొలగించాలంటూ రెవెన్యూ అధికారులు పరుగులు పెడుతుంటారు. అలాంటిది గ్రానైట్ ఖనిజ నిక్షేపాలున్న వేల కోట్ల రూపాయల విలువ చేసే 1500 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతే లేశమంతైనా చలించలేదు. ఈ అక్రమ భాగోతం వెనుక రెవెన్యూ, మైనింగ్ శాఖలకు చెందిన కొందరు అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలుకు చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బంకా చిరంజీవి చీమకుర్తి మండలంలోని రామతీర్థం పరిసరాల్లో విలువైన గ్రానైట్ భూములు అన్యాక్రాంతమయ్యాయని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు చీమకుర్తి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, డీటీ, సర్వేయర్, ఇతర సిబ్బందితో కలిసి ఇటీవల సర్వే నిర్వహించి గ్రానైట్ భూములు ఆక్రమణలకు గురైనట్లు ధ్రువీకరించారు.

సర్వేలో తేలింది ఇవేనా?

రెవెన్యూ అధికారులు చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, బూదవాడ పంచాయతీల పరిధిలో మొక్కుబడిగా నిర్వహించిన సర్వేలో ఆక్రమణలకు గురైన కొన్ని భూములను మాత్రమే గుర్తించారు. బూదవాడ పంచాయతీలో సర్వే నంబర్ 107లో 2.29 ఎకరాలు(వాగు), సర్వే నంబర్ 108లో 4.32 ఎకరాలు(వాగు), 109 సర్వే నంబర్‌లో 2.29 ఎకరాల(వాగు) భూములను హంస గ్రానైట్ సంస్థ ఆక్రమించినట్లు తేల్చారు.

■ ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 65/1ఏ, 66/1లో కొంత భూమిని జయ మినరల్స్, 67/1ఏ, 67/2ఏ, 70/2, 70/3లో కొంత భూమిని హంస మినరల్స్ ఆక్రమించుకున్నట్లు సర్వేలో వెల్లడైంది.

■ చీమకుర్తి రూరల్ పరిధిలో 580/1, 580/2, 584/1, 585లో మొత్తం 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కృష్ణసాయి గ్రానైట్స్ ఆక్రమించుకున్నట్లు రెవెన్యూ అధికారుల సర్వేలో నిర్ధారణ అయింది. సర్వే వివరాలు ఇటీవల బయటకు పొక్కడంతో పలుకుబడిగల నాయకులు, క్వారీల యజమానులు ఆక్రమించుకున్న భూముల వివరాలను పూర్తిగా వెల్లడించేందుకు రెవెన్యూ అధికారులు జంకుతున్నారు.

ఆక్రమణల చెరలో 1500 ఎకరాలు

చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, బూదవాడ పంచాయతీల పరిధిలో విలువైన గ్రానైట్ భూములు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు వద్ద ఉన్న గణాంకాల ప్రకారం 22ఏలో అనెక్షర్-1, 2లో కలిపి మొత్తం 2,947 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో చీమకుర్తి రూరల్ పరిధిలో 1909.12 ఎకరాలు, బూదవాడ పంచాయతీ పరిధిలో 330.66 ఎకరాలు, ఆర్.ఎల్.పురం పంచాయతీలో 708.51 ఎకరాలు విస్తరించి ఉండగా గ్రానైట్ క్వారీల పరిసరాల్లో ఆక్రమణలకు గురైన భూమి 1500 ఎకరాలు ఉంటుందని ఫిర్యాదుదారుల అంచనా. లీజులు, ఎన్‌ఓసీల పేరుతో పేదలను బెదిరించి తమ దారికి తెచ్చుకుని ఆక్రమించుకున్న భూములు 1200 ఎకరాలకు పైగా ఉన్నాయని సమాచారం. మరో 300 ఎకరాలకు పైగా భూములు ఎలాంటి ఆధారాలు లేకుండానే బడా నేతలు, గ్రానైట్ యజమానులు, రాజకీయ పలుకుబడిగల నేతలు చెప్పుచేతల్లో ఉన్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చీమకుర్తిలో బలమైన సామాజికవర్గానికి చెందిన ఓ కుటుంబం చేతుల్లో దాదాపు 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అంచనా.


గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బంకా చిరంజీవి(ఫైల్)

డంపింగ్ పేరుతో ప్రభుత్వ భూముల్లో పాగా

గ్రానైట్ వ్యాపారంలో ఆరితేరిన కొందరు వ్యక్తులు గతంలో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన భూముల పట్టాలను బలవంతంగా రద్దు చేయించి పావలా బేడా చేతిలో పెట్టి లీజులు, ఎన్‌ఓసీలు పొందారు. ఇప్పటికే క్వారీల పక్కన భూములను తమ ఆధీనంలోకి తీసుకుని డంపింగ్, ఇతర అవసరాల పేరుతో పాగా వేశారు.


కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్, ఇతర సిబ్బంది(ఫైల్)

> **భూకబ్జాపై అధికారులు స్పందించడం లేదు**
> చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, బూదవాడ పంచాయతీల పరిధిలో విలువైన గ్రానైట్ భూములను కొన్ని క్వారీల యజమానులు ఆక్రమించారు. వాటిని వెలుగులోకి తీయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా సర్వే చేశారు. వెలుగులోకి రావాల్సిన భూముల వివరాలు ఇంకా చాలా ఉన్నాయి. వాటిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. కానీ వారు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.
> – బంకా చిరంజీవి, బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు, ఒంగోలు

> **గత 30 ఏళ్ల నుంచి పర్మిషన్ ఇస్తున్నారు**
> గ్రానైట్ క్వారీలకు గత 30 ఏళ్ల నుంచి పర్మిషన్లు ఇస్తున్నారు. ఇప్పుడు నేను కొత్తగా ఇచ్చేదేముండదు. ఒకవేళ ఎన్‌ఓసీ ఇచ్చినా కాంపిటెంట్ అథారిటీస్ ఇస్తుంది. మా ఆఫీస్ తరఫున ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ మాత్రమే చేస్తాం. ఇదంతా ఏంటనేది నాకు తెలియదు.
> – ఆర్.బ్రహ్మయ్య, తహసీల్దార్, చీమకుర్తి

ధన బలం పుష్కలంగా కలిగిన కొందరు వ్యాపారులు రెవెన్యూ, మైన్స్ అధికారులను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడం వల్లే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టీపట్టనట్లుగా వ్యవహరించారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భూకబ్జాపై ప్రజా సంఘాల నాయకులు స్పందించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలన్న ధ్యాస రెవెన్యూ అధికారుల్లో లేకపోవడం శోచనీయమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చీమకుర్తి పోస్టింగ్ యమా కాస్ట్లీ!

గ్రానైట్ భూముల కారణంగానే చీమకుర్తి మండలంలో తహసీల్దార్ పోస్టింగ్ వేయించుకోవడానికి రూ.లక్షలకు లక్షలు లంచాలు ఇచ్చి పోటీపడుతున్నారన్నది బహిరంగ రహస్యం. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లలో కొందరు ఏడాదికి రూ.2 కోట్లకు పైగా సంపాదించుకుని వెళ్లారన్న విషయం చీమకుర్తిలోనే కాదు రెవెన్యూ శాఖలోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఆక్రమణదారులు రాజకీయ ప్రాబల్యం కలిగిన బడాబాబులు కావడం వల్లే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వివరాలు బయటకు తీయడానికి వెనుకంజ వేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


క్వారీలు, డంపింగ్ సమీపంలో కర్నూలు రోడ్డు పక్కనే ఆక్రమణకు గురైన వాగు

వైఎస్సార్ సీపీ జెండా తొలగింపు..
అదే బరితెగింపు..


పోలీసు పహారా నడుమ జేసీబీతో వైఎస్సార్ సీపీ జెండా పెకలిస్తున్న దృశ్యం

- కొనకనమిట్ల మండలం వెలిగండ్లలో వైఎస్సార్ సీపీ జెండా తొలగింపు
- టీడీపీ నాయకులతో చేతులు కలిపిన అధికార యంత్రాంగం
- ప్రైవేట్ స్థలంలో జెండాను జేసీబీతో పెకలించడంపై పార్టీ శ్రేణుల ఆగ్రహం

కొనకనమిట్ల: కూటమి నేతలు మళ్లీ బరితెగించారు. వైఎస్సార్ సీపీ జెండా తమ ముందు రెపరెపలాడటాన్ని జీర్ణించుకోలేక అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టి కళ్ల మంట తీర్చుకున్నారు. కొనకనమిట్ల మండలం వెలిగండ్ల గ్రామంలో వరుస ఘటనలు అధికారుల తీరును ధీకొట్టేలా చేశాయి. వివరాల్లోకి వెళ్తే.. వెలిగండ్ల గ్రామంలో రెండేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ జెండా ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డిపై ఆధిపత్యం ప్రదర్శించే ధోరణితో ఉన్న టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుట్రలకు తెరలేపారు. ఈ నెల 7వ తేదీన సర్పంచ్ వెంకటరెడ్డిని స్టేషన్‌కు రప్పించి.. గ్రామానికి వెళ్లిన పోలీసులు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు వైఎస్సార్ సీపీ జెండా తొలగించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏమాత్రం సంయమనం కోల్పోలేదు. జెండా తొలగింపు విషయాన్ని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 12వ తేదీన వెలిగండ్ల గ్రామంలో రెండు చోట్ల వైఎస్సార్ సీపీ జెండాలు ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఎస్సీ కాలనీ వాసులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొనడం టీడీపీ నాయకులకు కంటగింపుగా మారింది. కూటమి పాలనలో అధికార దుర్వినియోగాన్ని, సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అరాచకాలకు పాల్పడుతున్న తీరును వైఎస్సార్ సీపీ నేతలు ఎండగట్టడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోయాయి. నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేత సహకారంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి బుధవారం సాయంత్రం మరోమారు దురాగతానికి ఒడిగట్టారు. పోలీసుల పహారా నడుమ తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఆర్ఐ, గ్రామ సచివాలయ ఉద్యోగులు దగ్గరుండి మరీ జేసీబీతో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను పెకిలించారు.

అధికారమా.. అహంకారమా?

సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి తమ స్థలంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను పెకలించేందుకు అధికారులు, పోలీసులు అత్యుత్సాహం చూపడంపై స్థానిక మహిళలు దుమ్మెత్తిపోశారు. టీడీపీ నాయకులు ఆదేశించగానే విచక్షణ మరిచి అధికారులు ప్రవర్తించిన తీరుపై నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దౌర్జన్యానికి పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారుల తీరును పార్టీ జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. సర్పంచ్ పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాల్సిన పంచాయతీ కార్యదర్శి.. జెండా తొలగించాలంటూ సర్పంచ్‌కే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

తాత గొంతు కోసిన మనవడు

- రూ.500 కోసం ఘాతుకం
- వృద్ధుడి పరిస్థితి విషమం


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న షబ్బీర్

ఒంగోలు టౌన్: మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని ఒక యువకుడు నిరూపించాడు! ఒంగోలు నగరానికి చెందిన షేక్ షబ్బీర్(56) ట్రంకు రోడ్డులోని పూలకొట్ల బజారులో జామియా మసీదు వద్ద టైలరింగ్ షాప్ నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో మనవడి వరసయ్యే షేక్ ఇద్రిస్ టైలరింగ్ షాపు వద్దకు వచ్చి 500 రుపాయలు కావాలని కోరగా ఇచ్చారు. అంతలోనే మరో రూ.500 కావాలని ఒత్తిడి చేయగా షబ్బీర్ తన వద్ద అంత డబ్బు లేదని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన ఇద్రిస్ పక్కనే ఉన్న చిన్నపాటి కత్తి తీసుకుని షబ్బీర్ గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావమవుతున్న షబ్బీర్‌ను స్థానికులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కంపకల్లి


కంపకల్లిపై దొర్లుతున్న భక్తులు

హనుమంతునిపాడు: హరి నామ స్మరణతో హనుమంతునిపాడు మండలంలోని గొల్లపల్లి మారుమోగింది. ఇక్కడి నాగులేటి ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశ్వస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం కంపకల్లి ఉత్సవంతో ముగిశాయి. పాలెగాళ్లు తమ ఆచార సంప్రదాయల ప్రకారం పూజలు చేసి మేకపోతు గావు నిర్వహించారు. పోతురాజుల వీర కేకల నడుమ స్వామి వారి ఉత్సవమూర్తులతో కంపకల్లి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వాలిచర్ల, పెద్దగొల్లపల్లికి చెందిన చెక్కా వంశస్తులు ముందుగా కంపకల్లిపై దొర్లగా అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. కంపకల్లిపై దొర్లితే సంతాన ప్రాప్తి కలుగుతుందన్న విశ్వాసంతో దంపతులు, ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. కనిగిరి సీఐ ఖాజావలి, ఎస్సైలు మాధవరావు, కొండయ్య, శ్రీరామ్, పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.


చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి


ప్రమాదంలో మృతిచెందిన అనంతరాములు


అదుపు తప్పిన ఇటుక లోడు ట్రాక్టర్

బొల్లాపల్లి: ఇటుకల లోడు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం బొల్లాపల్లి మండలం వెల్లటూరు కురవ వద్ద చోటుచేసుకుంది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లలచెరువు మండలం తెల్లగట్లకు చెందిన గోవిందు, వెంకటరమణ దంపతుల కుమారుడు అనంతరాములు(23) గత రెండేళ్లుగా ముటుకులకు చెందిన బి.సాంబయ్య ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. బుధవారం ఇటుకులలోడు ట్రాక్టర్‌తో వినుకొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో వెల్లటూరు కురవ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పడంతో బోల్తా పడింది. ప్రమాదంలో అనంతరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.బాలకృష్ణ తెలిపారు. వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

కురిచేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగు చూసింది. ఎస్సై శివ కథనం మేరకు.. ఉలవల శ్రీను కుమారుడు వెంకటేశ్వర్లు(22) రోజూలాగే మంగళవారం రాత్రి తమ ఇంటి పైగదిలో నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం ఉదయం వ్యాపార నిమిత్తం బజారుకు వెళ్లిన శ్రీను తిరిగి 11.30 గంటలకు ఇంటి చేరుకున్నాడు. వెంకటేశ్వర్లు నిద్ర లేవలేదని కుటుంబ సభ్యులు చెప్పడంతో పైకి వెళ్లి పిలిచాడు. ఎంత సేపటికీ స్పందించకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచిచూడగా కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, యువకుడి మృతికి కారణాలు తెలియరాలేదు.